AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
27-06-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

**ఆరోగ్యాధికారి వచ్చేనా..**







**తాగునీటి కోసం అవస్థలు**

## కామారెడ్డి పోలీస్ శాఖకు డీజీపీ ప్రశంస




**అక్షరటుడే, కామారెడ్డి:** సీఎం ప్రజావాణి పిటిషన్ల పరిష్కారంలో కామారెడ్డి జిల్లా పోలీసు శాఖను డీజీపీ ప్రశంసించారు. జిల్లా నుంచి పెండింగ్ ఫిర్యాదులు లేకపోవడంపై డీజీపీ డా జితేందర్ జిల్లా నోడల్ అధికారి అయిన అదనపు ఎస్పీ కే నరసింహారెడ్డిని ప్రశంసించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఇట్లు మీదుగా ప్రశంస పత్రం అందజేశారు.





### కనుల పండువగా
## జగన్నాథ రథయాత్ర

**అక్షరటుడే, ఇందూరు:** హరే కృష్ణ.. హరే రామ..కృష్ణ కృష్ణ హరే హరే... అనే నామస్మరణతో నగరం మారుమ్రోగింది. నిజామాబాద్ ఇస్కాన్ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిజామాబాద్ ఇస్కాన్ అధ్యక్షుడు సిద్ధ బలరాం తోపాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త రథయాత్రను ప్రారంభించారు. జగన్నాథుని రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ముందు నుంచి ప్రారంభమైన రథయాత్ర గాంధీచౌక్, పెద్ద బజార్, ఆర్ ఆర్ చౌరస్తా, పులాంగ్, వినాయక్ నగర్, హనుమాన్ జంక్షన్ వరకు చేరుకొని.. తిరిగి పులాంగ్ చౌరస్తా, ఎల్లమ్మ గుట్ట చౌరస్తా, బస్టాండ్ మీదుగా గాంధీగంజ్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, కృపాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'పది' సప్లిమెంటరీలో 83 శాతం ఉత్తీర్ణత

**అక్షరటుడే, ఇందూరు:** పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి 815 మంది పరీక్షలకు హాజరుకాగా 680 మంది ఉత్తీర్ణులైనట్లు డీఈవో అశోక్ తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు జులై 7లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీవెరిఫికేషన్‌కు వేయి, రీకౌంటింగ్‌కు రూ.500 ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలని తెలిపారు.

### కామారెడ్డిలో 90.67 శాతం..

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో మొత్తం 90.67శాతం పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 675 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 612 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 376 మంది బాయ్స్, 236 మంది బాలికలు ఉన్నారు.

## భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి



**అక్షరటుడే, నిజాంసాగర్:** భూభారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి పేర్కొన్నారు. శుక్రవారం పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పరిష్కార మార్గాలకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దశరథ్, నాయబ్ తహశీల్దార్ రవికాంత్, ఆర్ఐ అంజయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2025 ఏడాదికి జాతీయ ఉత్తమ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రాజు అన్నారు. శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను http://nationalawardstoteachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా పంపాలని, ఈ నెల 23 నుంచి జూలై 13 వరకు గడువు ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపిక మార్గదర్శకాల కోసం వెబ్‌సైట్ సందర్శించాలన్నారు.

## నందిపేట్‌లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పర్యటన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి శుక్రవారం ఉమ్మడి నందిపేట్ మండలంలో పర్యటించారు. కుద్వాన్‌పూర్‌లో బీసీ హాస్టల్ నూతన భవన నిర్మాణం కోసం ఐదెకరాల అనువైన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపాలని అధికారులకు ఆదేశించారు. ఐలాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు కట్టడాలను పరిశీలించారు. ఎస్సారెస్పీ పరీవాహక ప్రాంతాన్ని త్వరలోనే అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలోని పలు దాబా హోటళ్లలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. అంతేగాకుండా మందుబాబుల సిట్టింగ్‌లకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం దాబాల్లో మద్యం విక్రయాలు, తాగడానికి అనుమతి లేదు. అయినా ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు చేపట్టడంతో పాటు సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. దాబాల్లో మద్యం తాగి ఇళ్లకు వెళ్తున్న సమయంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహిస్తుండటం గమనార్హం. తాజాగా పోలీసుల దాడులతో ఇటు మందుబాబులు, అటు దాబాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి



# దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు

**▪ అనుమతులు లేకున్నా లిక్కర్ అమ్మకాలు ▪ చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు**

జాతీయ రహదారులపై ఉన్న దాబాలు మందుబాబుల సిట్టింగ్‌లకు అడ్డాగా మారుతున్నాయి. హైవేలపై దాబాల నిర్వహణకు నిర్ణీత సమయం అనేది లేకపోవడంతో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఎప్పుడు దొరికితే అప్పుడు మందు దొరుకుతుండటంతో పలువురు అర్ధరాత్రులు కూడా దాబాల్లోకి వెళ్లి సిట్టింగ్‌లు వేస్తున్నారు. హైవేపై ఏర్పాటు చేసుకునే దాబాల్లో మద్యం విక్రయాలకు అనుమతులు ఉండవు. లేట్ నైట్ జర్నీ చేసే వాళ్లకు భోజన వసతి కోసం దాబాలు ఉపయోగపడతాయి. అనేక బస్సులు సైతం దాబాల వద్ద ప్రయాణికుల కోరిక మేరకు అరగంట పాటు నిలుపుతారు. కొందరు దాబాల నిర్వాహకులు ఎక్సైజ్ శాఖ అనుమతులు లేకున్నా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారు.

### రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం

జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. రాత్రిపూట ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. దాబాల్లో మద్యం తాగే వారు ఇళ్లకు వెళ్లే సమయంలో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. గతంలో పలు ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి.

### ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం.. పోలీసులు దాడులు

దాబాల్లో సిట్టింగ్‌లపై ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్నా.. అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అయితే రోడ్డు ప్రమాదాల నివారణపై ఫోకస్ పెట్టిన ఎస్పీ రాజేశ్ చంద్ర దాబాల్లో సిట్టింగ్‌లపై సీరియస్ అయ్యారు. మద్యం తాగి వాహనాలు నడపడంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతుండటంతో హైవేపై ఉన్న దాబాల్లో తనిఖీలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. దీంతో పోలీసులు దాబాల్లో దాడులు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఎన్‌హెచ్ 161పై ఉన్న ఆరు దాబాల్లో దాడులు జరిపి 132 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 71 మంది మందుబాబులను సైతం అదుపులోకి తీసుకున్నారు.

### అనుమతి ఇవ్వలేదు

దాబాల్లో మద్యం అమ్మకాలకు ఇప్పటివరకు అనుమతి ఇవ్వలేదు. దాబాల్లో మద్యం విక్రయించినా.. సిట్టింగ్‌లు నిర్వహించినా చర్యలు తీసుకుంటాం. దాబాలపై దాడులు చేస్తున్నాం.


– హన్మంత్ రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్

### నిజామాబాద్‌లో..



**నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లోని దాబాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ దాబాలో సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. కంఠేశ్వర్ నుంచి మాధవ నగర్ వెళ్లే మార్గంలో ఉన్న దాబాల్లో మద్యపానం అనుమతిస్తున్నా.. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు. కంఠేశ్వర్ సమీపంలో మందు బాబులకు సిట్టింగ్ ఏర్పాటు చేస్తున్నాడు. నందిపేటకు వెళ్లే క్రాసింగ్ వద్ద గల రెండు దాబాల్లో సిట్టింగులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. ఎడపల్లి మండలం కుర్నపల్లిలోని దాబాలో అర్ధరాత్రి వరకు మద్యం దొరుకుతుంది.

### దాబాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** దాబాల్లో మద్యం విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై బొజ్జ మహేష్ పేర్కొన్నారు. కామారెడ్డి జిఈల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదేశాల మేరకు గురువారం రాత్రి మండలంలోని పలు హోటళ్లలో, దాబాల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు.

# సీడీసీ ఛైర్మన్ రాజీనామా ఉపసంహరణ..

**పార్టీ నేతల బుజ్జగింపులే కారణమా..!**

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపిన సీడీసీ ఛైర్మన్ ఇర్షాదొద్దీన్ రాజీనామా అంశం రాత్రికి రాత్రే సద్దుమణిగింది. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పీఏల ఆగడాలు శ్రుతిమించుతున్నాయని.. ఆత్మగౌరవాన్ని చంపుకుని పార్టీలో కొనసాగలేక రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడి కైలాస్ శ్రీనివాస్ కూడా లేఖ రాశారు.

### రాజీనామాతో పార్టీలో దుమారం..

అయితే రాజీనామా అంశం పార్టీలో తీవ్ర దుమారం రేపింది. ముఖ్య నాయకుడు పార్టీ నుంచి వైదొలిగితే తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదముందని భావించిన ముఖ్య నేతలు రంగంలోకి దిగారు. ఛైర్మన్‌తో మాట్లాడి బుజ్జగించినట్లు సమాచారం. దాంతో ఆయన తన రాజీనామాను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఇర్షాదొద్దీన్‌ను 'అక్షరటుడే' సంప్రదించగా తాను రాజీనామా ఉపసంహరించుకుంటున్న విషయం నిజమేనన్నారు. తనకు ఎమ్మెల్యేపై ఎలాంటి కోపం లేదని మరోసారి స్పష్టం చేశారు. పీఏల వైఖరి నచ్చకే రాజీనామాకు సిద్ధమైనట్టు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు.



### కష్టపడ్డ వారికి న్యాయం జరగట్లేదని..

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కష్టపడ్డ ఏ నాయకునికి ఎలాంటి గౌరవం లేదని గురువారం తాను విడుదల చేసిన రాజీనామా పత్రంలో ఇర్షాదొద్దీన్ పేర్కొన్నారు. ఏ కార్యక్రమం జరిగినా మండల ప్రెసిడెంట్లకు గాని వివిధ హోదాలో ఉన్న నాయకులకు గాని ఎలాంటి సమాచారం ఉండదని వాపోయాడు. వివిధ మండలాల్లో ఉన్న అధికారులకు పీఏలు ఫోన్లు చేసి ఏ నాయకుడు వచ్చినా ఏ కార్యకర్త వచ్చినా తాము చెప్పేవరకు పని చేయవద్దని చెప్పడం జరిగిందని ఆయన లేఖలో వివరించారు. కానీ శనివారం ఆయన తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

## 'అధికారాన్ని కాపాడుకునేందుకే ఆ రోజుల్లో ఎమర్జెన్సీ..'

**అక్షరటుడే, ఇందూరు:** తన పదవి, అధికారాన్ని కాపాడడం కోసం ఆ రోజుల్లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించిందని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన చీకటి రోజులు ఎమర్జెన్సీ అని దుయ్యబట్టారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాంగ్రెస్ కాలరాసిందన్నారు. ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా కాంగ్రెస్ పాలన కొనసాగిందన్నారు.

### తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారు..

తెలంగాణ ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెట్టాడని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోసం ఢిల్లీకి వెళ్లడం.. రావడం తప్ప ఏ రోజు మాట్లాడలేదని అన్నారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, జిల్లా నాయకులు న్యాలం రాజు, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ, స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బ్యాగులు, నిత్యావసర సరుకుల పంపిణీ



**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండలం కూనిపూర్ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మాదాల చారిటబుల్ ట్రస్ట్, సీసీడీ ఆధ్వర్యంలో ట్రస్ట్ మేనేజర్ ఠాగూర్ చేతుల మీదుగా స్కూల్ బ్యాగులు, పంచాయతీ కార్మికులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. ట్రస్ట్ చేపట్టే సేవా కార్యక్రమాలకు చైర్మన్ ఠాగూర్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ డాక్టర్ రాజారెడ్డి, నర్సయ్య, సొసైటీ మాజీ చైర్మన్లు గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, కాంతయ్య, కృష్ణారెడ్డి, లచ్చరెడ్డి, బాను, నవీన్ రెడ్డి, గంగారాం, సాయిలు, దేవయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ పాల్గొన్నారు.

## చెరువు తూముకు షట్టర్ ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామ ఊర చెరువు తూముకు షట్టర్ లేకపోవడంతో వర్షం నీరు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారుల పనితీరుపై శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. చెరువులోకి వచ్చే నీరు వృథాగా పంట పొలాల్లోకి వెళ్లడంతో చెరువు బీడుగా మారుతుందని, చెరువు కింద ఉన్న 250 ఎకరాల భూమి సైతం పడావుగా మారుతోందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో మిర్జాపూర్ సొసైటీ చైర్మన్ రాంబాబు, మాజీ ఎంపీటీసీ లాలయ్య, మాజీ సర్పంచ్ సాయిరాం, మాజీ ఎంపీటీసీ నాగ్‌నాథ్ పటేల్, రాములు, అచ్చయ్య పాల్గొన్నారు.

## 30న రథయాత్రను విజయవంతం చేయండి




**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించనున్నజగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలని బోధన్ ఇస్కాన్ ఇన్‌ఛార్జి అశోక్ ఆత్మదాస్ కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆచంపల్లి చౌరస్తా నుంచి శక్కర్ నగర్, కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, రాకాసీపేట్ వరకు రథయాత్రం కొనసాగుతుందని తెలిపారు. యాత్ర రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం టీటీడీ కళ్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. రథయాత్రలో పదివేల మంది భక్తులు పాల్గొననున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు కేశవదాస్ ప్రభూజీ, నర్సింహులు ప్రభూజీ, రత్న తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన సొసైటీ చైర్మన్



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రంలోని రైతుశిక్షణ కేంద్రం వద్ద అచ్చంపేట సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి మొక్కలు నాటారు. హరితహారంలో భాగంగా శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ గుమస్తా శ్రీనివాస్, సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షా కాలం వచ్చిందంటే వ్యాధుల పట్ల అప్రమత్తత ఎంతో అవసరం. ప్రధానంగా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రంగా ఉండాలి. ఇలా ఉండాలంటే ప్రజలతోపాటు నగరపాలక సంస్థలోని ఎంహెచ్‌ఓ.. శానిటరీ విభాగం ప్రధాన భూమిక పోషించాల్సి ఉంటుంది. కానీ, నిజామాబాద్ నగర పాలక సంస్థలో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

- అక్షరటుడే, ఇందూరు




# ఆరోగ్యాధికారి వచ్చేనా..

■ ఎన్‌ఎంసీలో రెండేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టు ■ ప్రజారోగ్యం గాలికి..

నిజామాబాద్ బల్దియాలో ప్రధాన అధికారి కమిషనర్. ఆ తర్వాత స్థానం డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, డిప్యూటీ సిటీ ప్లానర్ వంటివి ప్రధానమైనవి. అయితే గత రెండు నెలలుగా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం ఆ రెండు పోస్టులను భర్తీ చేశారు. కానీ గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్న మున్సిపల్ వైద్యాధికారి పోస్ట్ మాత్రం భర్తీ చేయలేదు. ప్రజారోగ్యాన్ని పర్యవేక్షించే పోస్టును ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పజెప్పారు.

### ఇదీ పరిస్థితి..

రాష్ట్రంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌లలో నిజామాబాద్ ఒకటి. సుమారు నాలుగు లక్షల మంది నివసిస్తున్నారు. ఇంత ప్రాచుర్యం ఉన్నా.. గత రెండేళ్లుగా ఎంహెచ్‌వోను నియమించలేరు.

నిజామాబాద్ బల్దియా పరిధిలో మొత్తం ఎనిమిది మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు ఉన్నారు. ఇందులో రెగ్యులర్ ముగ్గురు కాగా.. అయిదుగురు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల్లోనూ ఒకరికి కుక్కల నియంత్రణ విభాగం, మరొకరికి డంపింగ్ యార్డు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. దీంతో పూర్తిస్థాయిలో పనులు జరగడం లేదనే అపవాదు ఉంది.

### వర్షా కాలం ఇబ్బందులు...

ప్రజారోగ్యాన్ని కాపాడటం, ప్రజా ప్రదేశాల్లో పరిశుభ్రంగా ఉంచటం, మురుగునీటి వ్యవస్థను నిర్వహించటం, వ్యాధుల వ్యాప్తిని నివారించడం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ప్రధాన విధి. అయితే ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వీటి ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అలాగే హోటళ్లు, కల్తీ ఆహారం, తినుబండారాలపై నియంత్రణను పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ, నగరంలో ఇలాంటి తనిఖీలు చేపట్టిన దాఖలాలు తక్కువగానే ఉన్నాయి. ఒకటి, రెండుసార్లు జరిమానా విధించి చేతులు దులిపేసుకుంటున్నారు. రెగ్యులర్ అధికారి ఉండి, నిత్య పర్యవేక్షణ ఉంటేనే కల్తీ ఆహారాన్ని నివారించే అవకాశం ఉంటుంది. దీనికితోడు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వెసులుబాటు ఉంటుంది.

### బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలి

ఎంహెచ్‌ఓ పోస్టు కోసం ఇప్పటికే సీడీఎంఏ కు లేఖ రాశాం. ప్రజారోగ్యాన్ని కాపాడటం అందరి బాధ్యత. రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎవరైనా విధులను సక్రమంగా నిర్వహించాల్సిందే. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పూర్తి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.

– దిలీప్ కుమార్, కమిషనర్

## ప్రజలకు స్వచ్ఛమైన కల్లు అందించాలి



**అక్షరటుడే, కోటగిరి :** ఈత చెట్ల పెంపకంతో ప్రజలకు స్వచ్ఛమైన కల్లు అందుతుందని నిజామాబాద్ సూపరిటెండెంట్ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కోటగిరి మండలకేంద్రంలో గీత పరిశ్రమ సహకార సంఘం ఆధ్వర్యంలో హరితహారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈత వనంలో పెంచిన ఈత చెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ బోధన్ సీఐ భాస్కర్ రావు, ఎస్సై జమీల్,డీటీఎఫ్ ఎస్సై విలాస్ కుమార్, ఎక్సైజ్ సిబ్బంది, కోటగిరి టీసీఎస్ అధ్యక్షుడు శంకర్ గౌడ్, ఉపాధ్యక్షుడు అరుణ్ కుమార్, రాష్ట్ర గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్ గౌడ్ గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సన్ రైస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ట్రాఫిక్ బారికేడ్లు అందజేత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని సన్ రైజ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ట్రాఫిక్ బారికేడ్లు అందజేశారు. ఆస్పత్రి యాజమాన్యం డా ఛిద్రవార్ రాఘవేందర్ (ఆర్థోపెడిషన్), డా వినయ్ దనపాల్ (ఎండోక్రైనాలోజిస్ట్) చేతుల మీదుగా 20 ట్రాఫిక్ బారికేడ్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇన్ స్పెక్టర్ ప్రసాద్, ఆర్ఐ వినోద్, సిబ్బంది శ్రీనివాస్, కిరణ్, రహీం పాషాకు అందచేశారు. పోలీసులు ఆస్పత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.

## స్థలం విషయంలో వివాదం..

■ గొడ్డళ్లతో పరస్పరం దాడులు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఇంటివద్ద మరుగుదొడ్డి స్థలం విషయంలో గొడ్డళ్లతో దాడులు చేసుకున్న ఘటన రామారెడ్డి మండలం మద్దికుంటలో జరిగింది. గ్రామానికి చెందిన ముదాం రాజయ్య, ముదాం నర్సయ్య అన్నదమ్ములు. వీరి మధ్య ఇంటి మరుగుదొడ్డి స్థలం విషయంలో గొడవ తలెత్తింది. ఈ క్రమంలో మాటామాట పెరిగి గొడ్డళ్లతో దాడులు చేసుకున్నారు. ఇందులో రాజయ్య, అతని కుమారుడు నరేష్ కు గాయాలు కాగా, స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతుల ఖాతాల్లో భరోసా నిధులు జమచేయాలి

**అక్షర టుడే, ఆర్మూర్ :** రైతులకు రావాల్సిన రైతు భరోసా నిధులు రూ.25 వేల కోట్లు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్గట్ల మండల అధ్యక్షుడు రాజాపూర్ణనందం, మాజీ ఎంపీపీ ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రైతులకు పంట సీజన్‌లో రైతుబంధు జమ చేసేవారని, కానీ, కాంగ్రెస్ హయాంలో పెట్టుబడి ఖర్చుల కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. నాయకులు నర్సయ్య, చిన్న నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయగా.. 15మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నట్లుగా గుర్తించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ చేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా పదిమందికి రూ.15,000 జరిమానా విధించారు. రాథోడ్ విలాస్, ఇందూరు నవీన్‌కుమార్, స్వామి, నగేష్‌కు ఒకరోజు జైలుశిక్ష, అశోక్‌కు రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని ట్రాఫిక్ ఏసీపీ తెలిపారు.




### క్లాక్‌టవర్‌కు కొత్త అందాలు..

నగరంలోని గంజ్‌లో క్లాక్ టవర్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఈ మరమ్మతులు జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా పనిచేయకుండా ఉన్న గడియారానికి మరమ్మతులు చేస్తున్నారు. మొత్తంగా రూ.9 లక్షల వరకు నిధులతో మరమ్మతు పనులు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రస్తుతం టవర్‌కు రంగులు వేయడంతో పూర్వవైభవం వచ్చినట్లయ్యింది.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్:** భీమ్‌గల్ మండలం బడా భీంగల్ గ్రామానికి చెందిన ఏంపల్లి గంగామణి హృద్రోగ సమస్యతో నిమ్స్‌తో చికిత్స పొందుతున్నారు. దీంతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందించి బాధిత కుటుంబానికి రూ.1,50,000 ఎల్‌వోసీని శుక్రవారం హైదరాబాద్ లోని నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'స్థానిక' ఎన్నికల్లో గెలుపు కోసం కృషిచేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకులు, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, సిరిసిల్ల గ్రంథాలయ చైర్మన్ సత్యనారాయణ గౌడ్ అన్నారు. డీసీసీ అధ్యక్షుడు కైలాష్ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, నిజాంసాగర్:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహమ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి అరుణ పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా మండల కేంద్రంలో నీళ్ల కుండీల్లో నీళ్లను తొలగింపజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించారు. వేగంగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లయ్య గారి ఆకాష్ ఎంపీడీవో అనిత, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్‌సింగ్ ఉన్నారు.





# తాగునీటి కోసం అల్లాడుతున్న జనం..

తలాపున నీళ్లున్నా గొంతులు తడారట్లేదు.. వర్షా కాలం వచ్చినా నీటి గోస తప్పట్లేదు.. చిన్నమల్లారెడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని గురురాఘవేంద్ర కాలనీలో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో కాలనీవాసులంతా శుక్రవారం ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు.

–అక్షరటుడే, కామారెడ్డి

### వాటర్ ట్యాంక్‌లో నీళ్లున్నాయ్..

విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే.. ప్రస్తుతం పంచాయతీ పరిధిలో వాటర్ ట్యాంక్ ఉంది. దాంట్లో పుష్కలంగా నీళ్లున్నాయి. కానీ కాలనీవాసులకు నీళ్లు మాత్రం అందట్లేదు. దీంతో అపార్ట్‌మెంట్లలో ఉన్న ప్రజలకు నీళ్లు రావట్లేదు. ఈ విషయమై రెండు నెలల నుంచి పంచాయతీ సిబ్బందికి తెలియజేసినా సమస్యను పరిష్కరించట్లేదని వాపోయారు.

### రోజువారి పనులకు ఇబ్బందే..

వాటర్ ట్యాంక్‌లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ ట్యాంక్ నుంచి ఇళ్లలోకి నీళ్లు సరఫరా చేసే వ్యవస్థలో ఇబ్బందుల కారణంగా కాలనీవాసులకు నీళ్లు అందట్లేదు. ఈ విషయమై పంచాయతీ సెక్రెటరీని వివరణ కోరగా పైప్ లైన్ జామ్ కావడం వల్ల సమస్య తలెత్తిందన్నారు. పప్ లైన్ కోసం సిబ్బంది పనులు చేస్తున్నారని తెలిపారు. రెండు రోజుల్లో నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు.